భూకంపంతో ఇళ్ల నుంచి జనం పరుగులు

జిల్లాలో పలుచోట్ల 3 నుంచి 5 సెకండ్ల పాటు కంపించిన భూమి

జనగామ, (నమస్తే తెలంగాణ)/జనగామ చౌరస్తా/ దేవరుప్పుల/ జనగామ రూరల్/స్టేషన్‌ఘన్ పూర్/పాలకుర్తి/ బచ్చన్నపేట/తరిగొప్పుల, డిసెంబర్ 4 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం పలుచోట్ల స్వల్ప భూకంపనలు వచ్చాయి. ఉదయం 7.28 గంటలకు 3 నుంచి 5 సెకండ్ల వరకు ఒక్కసారి భూమి కదిలి కిటికీల అద్దాలు ఊగాయి. మూసి ఉన్న ఇండ్ల తలుపులు బయట నుంచి ఎవరో కొట్టినట్లు కదలికలు వచ్చాయి. దీంతో ఇళ్లలోని వస్తువులు కింద పడిపోగా.. మంచాలు, బెడ్‌లు కొద్ది క్షణాలు కంపించాయి. దీంతో ఏం జరుగుతుందో తెలియక భయాందోళనతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపం ప్రభావం రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. అయితే భూకంపం వల్ల ఎలాంటి నష్టం జరిగినట్లు సమాచారం లేకపోయినా..కొన్ని ఇళ్లలో గోడలు బీటలు వారినట్లు తెలుస్తున్నది. ' పొద్దున్నే వంటిట్లో పనిచేసుకుంటుంటే ఒక్కసారిగా తల గిర్రున తిరిగినట్లయింది.. తనకు బీపీ తగ్గడం వల్ల అలా జరిగింది కావొచ్చనుకున్న తర్వాత తెలిసింది భూకంప ప్రభావం..' అని ఓ గృహిణి పేర్కొంది. ఇంట్లో ఉన్న కుర్చీ లు..మంచాలు ఊగాయి. ఇంటి గోడలు కదిలినట్లు అయింది. భయంతో బయటకు వచ్చామని పట్టణానికి చెందిన ఓ వ్యాపారి అన్నారు. 1986లో ఒకసారి జనగామ ప్రాంతంలో భూకంపం వచ్చింది.. ఇన్నేళ్ల తర్వాత భూమి కంపించడం ఇది రెండోసారి అని ఓ వృద్ధుడు గత అనుభవాన్ని పంచుకున్నాడు. దేవరుప్పులకు చెందిన మాజీ సర్పంచ్ ఈదునూరి నర్సింహారెడ్డి మాట్లాడుతూ తన 74 ఏండ్ల వయస్సులో మొదటి సారి భూకంపం రావడం ప్రత్యక్షంగా చూశానన్నారు. తాను వంద కిలోలపైన బరువు ఉండి కింద కాళ్లు పెట్టి ఓ కుర్చీలో కూర్చోగా కాళ్ల కింద వింత శబ్దం వచ్చిందని తెలిపారు. కుర్చీ వైబ్రేషనకు గురికాగా కిటికీలు, దర్వాదలు కొట్టుకున్నాయన్నారు. పలు గ్రామాల్లో ఇంట్లోని వంట సామగ్రి, రేకుల చప్పుడు కావడంతో ప్రజలు భయందోళన చెందారు.

అటవీ సంరక్షణపై అవగాహన సదస్సు

జఫర్‌గడ్, డిసెంబర్ 4 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో అటవీ సంరక్షణపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి మురళీధర్ మాట్లాడుతూ అడవుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. అటవీ సంరక్షణ, వన్య ప్రాణుల సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలన్నారు. అడవులకు నిప్పు పెడితే మానవాళి మనుగడకు పెనుముప్పు అని మురళీధర్ తెలిపారు. పచ్చదనం లేకుంటే భవిష్యత్తు లేదని వన సంరక్షణయే మన సంరక్షణ అని తెలిపారు. జఫర్‌గఢ్ ప్రాంతంలో ఎలుగుబంట్ల సంచారంపై ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలుగుబంట్లు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమం లో డీఆర్‌వో నర్సింగ్ నాయక్, సెక్షన్ ఆఫీసర్ ఎండీ జరీనా బేగం, బీట్ ఆఫీసర్ శిరీష, రవి, టీపీ అనిల్, వాచర్లు మోహన్, సంతోష్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అటవీ అధికారి మురళీధర్

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : డీఈవో

రఘునాథపల్లి, డిసెంబర్ 4: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని ఖిలాషాపురంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. తరగతి గదులు, వంటశాలను, విద్యార్థులకు ఏర్పాటు చేసిన పలు మౌలిక వసతులను రమేశ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం హాస్టల్స్‌లో కార్పొరేట్ స్థాయి సదుపాయాలను కల్పించిందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జీసీడీవో గౌషియాబేగం, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సునీత, సీఆర్‌పీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రఘునాథపల్లి, డిసెంబర్ 4: మండలంలోని కుర్చపల్లికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఇమాం రాములు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సంఘం రాష్ట్ర కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మగల్ల కృష్ణ, నాయకులు నాగిల్ల రాజు, మండల అధ్యక్షుడు కొట్టె ప్రేమ్ కుమార్, బాబు, రమేశ్, అశోక్, చిట్టిబాబు, అనిల్, ఏసోబు ఉన్నారు.

నర్సింగ్‌లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

బచ్చన్నపేట, డిసెంబర్ 4 : ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సు పూర్తి చేసి బోధనలో అనుభవమున్న అభ్యర్థులు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీ పోస్టుకు దరఖాస్తు చేయాలని కేజీబీవీ ప్రత్యేక అధికారి గీత తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు గురువారం ఉదయం 9 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9866379272 నంబర్‌ను సంప్రదించాలని వారు కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★Urgently Required Junior lecturers for Biology and Physics for Shaheen Junior college at Mulugu X Road, Hanumakonda. Contact Ph: 8374999474, 8374999475
NTW-000

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326503

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

అందమైన చేతిరాతకు సాధనే మార్గం

దేవరుప్పుల, డిసెంబర్ 4: అందమైన చేతిరాతకు సాధన చేస్తే అందరికీ సాధ్యమేనని ప్రముఖ చేతిరాత నిపుణుడు గుర్రం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలోని సాయి ప్రశాంతి విద్యా నికేతన్‌లో బుధవారం చేతరాతపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అందమైన చేతి రాత నేర్చుకుంటే పరీక్షల్లో సులువుగా మార్కులు సాధించే అవకాశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ తోటకూరి పాండుకృష్ణ, ప్రిన్సి పాల్ స్వప్న పాల్గొన్నారు.

ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీదేవి

తరిగొప్పుల ఎస్సైగా శ్రీదేవి

తరిగొప్పుల, డిసెంబర్ 4 : తరిగొప్పుల ఎస్సైగా శ్రీదేవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సుబేదారి రూరల్ మహిళా పోలీస్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీదేవి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఆమె మాట్లాడుతూ మండలంలో శ్రాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకారం అందించాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావొచ్చన్నారు. పోలీసులు ప్రజలకు స్నేహితులు అని ఆమె పేర్కొ న్నారు. అనంతరం ఎస్సైకి కానిస్టేబుల్స్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- పరిశుభ్రతను పాటించాలి
- కేజీబీవీ, మోడల్ స్కూల్ పరిశీలనలో కలెక్టర్

స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

గూడూరు హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న రోహిత్‌సింగ్

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 4 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు తప్పనిసరిగా మెనూ పాటించాలని జిల్లా కలెక్టర్ షేక్‌రిజ్వాన్‌బాషా కోరారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, నమిలిగొండలోని కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. మోడల్ స్కూల్, కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనంతోపాటు పరిసరాలను పరిశీలించారు. వంట సరుకులను పరిశీలించి డేట్ అయిపోయిన వాటిని మార్చాలని, కుళ్లిన కూరగాయలను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించరాదన్నారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని ఆయన ఆదేశించారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ వ్యాధులు ప్రబలకుండా చూడాలని సూచించారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతోపాటు పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సబ్జెక్ట్‌ల వారీగా ప్రశ్నలు అడిగి వారిలోని నైపుణ్యతను పరిశీలించారు. గణితం, హిందీ సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి ఒక్కరూ టెన్త్‌లో 10 జీపీఏ సాధించాలని, సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో నీటి సమస్యను కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నమిలిగొండలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ సతీశ్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్‌లోని జడ్పీ హైస్కూల్‌లో ఆర్డీవో డీఎస్ వెంకన్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. బుధవారం ఆయన పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వంటల నాణ్యత, రుచులను పరిశీలించారు. పరిశుభ్రమైన వాతావరణంలో వంట చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సంపత్, పీడీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్

పాలకుర్తి : గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు పౌష్టికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని గూడూరు గిరిజన బాలికల హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. రోహిత్‌సింగ్ మాట్లాడుతూ వంట సామాగ్రి విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కుళ్లిన కూరగాయలను వాడొద్దని సూచించారు. ఆలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థినులు చదువులో రాణించి 10/10 ఫలితాలు సాధించాలన్నారు. ఆనంతరం ఎల్లరాయిని తొర్రూరు జేలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రా న్ని ఆయన పరిశీలించారు. తూకంలో మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ గొనె మైసిరెడ్డి, ఆర్ఐ రాకేశ్, సీఈఓ రణధీర్ ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ పీహెచ్‌సీకి మరో ఇద్దరు డాక్టర్లు

సిద్దుల సుదర్శన్

టీ అన్న

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 4 : స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీ ఆసుపత్రికి మరో ఇద్దరు వైద్యులు విధుల్లో చేరారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రికి మండలంలోని తాటికొండకు చెందిన సిద్దుల శ్రవణ్, హనుమకొండకు చెందిన అన్న డాక్టర్లుగా విధుల్లో చేరారు. వీరు డిప్యూటీ డీఎంహెచ్ సుధీర్‌కు రిపోర్టు చేశారు. ప్రతి రోజు ఆసుపత్రికి సుమారు 300 వరకు ఓపీ వస్తుండగా ఇద్దరు వైద్యులు విధుల్లో చేరడంతో మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంది.

బీఆర్ఎస్ పాలనలోనే విద్యార్థులకు మెరుగైన వసతులు

కేజీబీవీ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

బచ్చన్నపేట, డిసెంబర్ 4 : బీఆర్ఎస్ పాలనలోనే గురుకులాల్లో నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులను విద్యార్థులకు కల్పించినట్లు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గదరాజు చందు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచనల మేరకు బుధవారం గురుకులాల్లో సమస్యలు తెలుసుకునేందుకు మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తే అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సర్కారు హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ వంటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. విద్యార్థులతో మాట్లాడేందుకు వెళ్తే ప్రభుత్వం అనుమతించడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి, నాయకులు నరేందర్ , ఉపేందర్‌రెడ్డి, వేణుగోపాల్, ఈదులకంటి ప్రతాప్‌రెడ్డి, బొమ్మెన సందీప్, పర్వతం మధుప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులను అరికట్టాలి

జనగామలో ర్యాలీ నిర్వహిస్తున్న పరిరక్షణ సమితి సభ్యులు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 4 : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల నుంచి వారిని రక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్కు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు కాసోజు రాజేశ్వరాచార్యులు, ఎక్కలదేవి మోహనకృష్ణ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో కోటిన్నర జనాభాతో మైనార్టీలుగా ఉన్న హిందువులపై ఓ వర్గం ప్రజలు భౌతిక దాడులకు దిగడం, ఆలయాలను ధ్వంసం చేయడం సరైంది కాదన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన కృష్ణదాస్‌ను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ, ఆర్య సమాజ్, ఇస్కాన్, అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు ఆకుల శ్రీనివాస్, బైరి అంజయ్య, రామిని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి, శివరాజ్ యాదవ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు గుర్రం నాగరాజు, ఎనగందుల కృష్ణ, ధనుంజయ ప్రభు, మార్వాడీ సమాజ్ నుంచి కమలేశ్, యాదగిరి, ఉమేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

9న క్వాలిటీ మేనేజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 4 : జిల్లా వైద్యారోగ్యశాఖలో ఔట్‌సోర్సింగ్ విధానంలో క్వాలిటీ మేనేజర్, డిస్ట్రిక్ట్ ఎపిడెమిలాజిస్ట్‌గా విధులు నిర్వహించడానికి అర్హులైన అభ్యర్థులకు ఈ నెల 9వ తేదిన మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అనుభవం, ఆసక్తిగల అభ్యర్థులు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. సందేహాలుంటే తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

నేడు ప్రజా ప్రతినిధులు, అధికారులకు క్రీడా పోటీలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 4 : ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల వేడుకల్లో భాగంగా గురువారం (నేడు) ఉదయం 8.30 గంటలకు జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్, బ్యాడ్మింటన్, రన్నింగ్, మహిళలకు లెమెన్ స్పూన్, క్యారమ్స్, చెస్ అండ్ మ్యూజికల్ చైర్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు ఆటల పోటీల్లో పాల్గొనాలని కోరారు. వివరాలకు జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి కార్యాలయం సెల్ నంబర్ 9652197323కి ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రజలతో పోలీసులు స్నేహభావంగా ఉండాలి : సీపీ

ఠాణాలోని రికార్డులను పరిశీలిస్తున్న అంబర్‌కిశోర్‌ఝా

రఘునాథపల్లి, డిసెంబర్ 4: ప్రజల్లో నమ్మకాన్ని పెంచడంతోపాటు వారితో పోలీసులు స్నేహభావంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఠాణాలోని పరిసరాలను పరిశీలించిన అనంతరం రికార్డులను సీపీ పరిశీలించారు. సిబ్బందికి పోలీస్ శాఖ మంజూరు చేసిన కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు, నిందితుల అరెస్ట్, రౌడీషీటర్ల వివరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలు, కోర్టులో పెండింగ్ కేసుల వివరాలను ఎస్సై నరేశ్ యాదవ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబర్‌కిశోర్‌ఝా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని కోరారు. ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పండ్ల మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ట్రైనీ ఐపీఎస్ మానాన్ భట్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, ఎస్సై నరేశ్‌యాదవ్, ట్రైనీ ఎస్సై సోని పాల్గొన్నారు.

పాత బస్టాండ్ స్థలంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మించాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దేవరుప్పుల, డిసెంబర్ 4: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఉన్న పురాతన బస్టాండ్ స్థలంలోనే సులబ్‌కాంప్లెక్స్‌ను నిర్మించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీ నారాయణకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి వివిధ పనుల కోసం గ్రామాల నుంచి వచ్చే వారికి టాయిలెట్స్ లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురౌతున్నారని తెలిపారు. దీనిని అధిగమించడానికి పురాతన బస్టాండ్ స్థలంలో అత్యవసరంగా సులబ్‌కాంప్లెక్స్‌ను ప్రభుత్వం నిర్మించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, బస్వ మల్లేశ్,జోగు సోమ నర్సయ్య, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మాచర్ల బాబు, భిక్షపతి గ్రామ అధ్యక్షుడు లొడంగి వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి, బీజేపీ మండల అధ్యక్షుడు కాసాని సత్యనారాయణ, సీపీఎం జిల్లా నాయకుడు సింగారపు రమేశ్, మండల కార్యదర్శి ఇంటి వెంకట్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి జీడి ఎల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పడమటింటి నర్సింహులు పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల సాయం

నర్మెట, డిసెంబర్ 4: మండల కేంద్రానికి చెందిన గాదర అరుణ్, బండ ఎల్లేశ్, నిమ్మకంటి భిక్షపతి, గాగిళ్లాపురం సిద్దయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. సమాచారం తెలుసు కున్న బీఆర్ఎస్ నాయకులు బుధవారం మృతుల కుటుంబాలను పరామర్శించి 50 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్, మాజీ సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, జడ్పీ కోఅప్షన్ మాజీ సభ్యుడు ఎండీ గౌస్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు నక్కల రవి, నాయకులు బెడుదం సుధాకర్, ఆమెడపు కిరణ్‌కుమార్‌రెడ్డి, గడపురం శశిరత్, ముక్కెర మహేందర్, పొన్నం బాలకృష్ణ, గడ్డం సుధాకర్, గడ్డం మల్లేశం, మారబోయిన ఎల్లయ్య, పులి సురేశ్ పాల్గొన్నారు.

జీడికల్ ఆలయానికి రూ.4.87 లక్షల ఆదాయం

జీడికల్ ఆలయంలో భక్తుల కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

లింగాలఘనపురం, డిసెంబర్ 4 : మండలంలోని జీడికల్ వీరాచల స్రీతారామచంద్ర స్వామి ఆలయానికి రూ.4.87 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో వంశీ తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. హుండీలను దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటలక్ష్మి సమక్షంలో తెరువగా రూ.2.77 లక్షలు వచ్చాయన్నారు. ఆలయ ప్రాంగణంలో కొబ్బరి కాయల విక్రయానికి వేలం నిర్వహించగా రూ.2.10 లక్షలు వచ్చాయన్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మహ్మదాపురానికి చెందిన జనగాం రమేశ్ బాబు వేలం దక్కించు కున్నాడన్నాడు. ఇదే వేలానికి గత సంవత్సరం రూ.2.02 లక్షలు వచ్చాయన్నారు. యాదాద్రికి చెందిన విశ్రాంత ప్రిన్సిపల్ ధరూరి రామాచార్యులు రచించగా, గట్టు హిరణ్య గానం చేసిన జీడికల్ వీరాచల సీతారామచంద్రస్వామి సుప్రభాత సీడీని ఈ సందర్భంగా విడుదల చేశామని ఈవో వంశీ వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్స్పెక్టర్ వెంకట లక్ష్మి, జనగామ ఉప్పలమ్మ దేవాలయ ఈవో కేకే రాములు, జీడికల్ ఆలయ చైర్మన్ ఏలె నరసింహమూర్తి, అర్చకులు భార్గవాచార్యులు, మురళీకృష్ణమాచార్యులు పాల్గొన్నారు. మరోవైపు కొమురవెల్లి దేవస్థాన మాజీ చైర్మన్, కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సేవెల్లి సంపత్ ఆలయాన్ని సందర్శించారు. స్వామివారికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు.

అంజనేయస్వామి గుడి నిర్మాణానికి భూమిపూజ

నర్మెట, డిసెంబర్ 4: మండల కేంద్రంలోని శ్రీకాశీ విశ్వనాథ స్వామి శివాలయంలో అంజనేయస్వామి నిర్మాణం, నవగ్రహాలు, జంటనాగుల విగ్రహాల ప్రతిష్ఠాపనకు బుధవారం భూమి పూజ చేశారు. స్థపతి రాజు గురువు ఆధ్వర్యంలో ముగ్గు పోశారు. ఆలయం చుట్టూ భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెంబర్తిలో ఆర్టీసీ బస్సులు ఆపాలని ఎమ్మెల్యేకు వినతి

ఎమ్మెల్యే పల్లాతో పెంబర్తి గ్రామస్తులు

జనగామ రూరల్, డిసెంబర్ 4 : ఉమ్మడి వరంగల్ జిల్లాకు ముఖ ద్వారమైన పెంబర్తిలో ఆర్టీసీ బస్సులను ఆపాలని స్థానికులతోపాటు ప్రజాప్రతినిధులు కోరారు. దీనిపై బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే పల్లా ఆర్టీసీ డీపో మేనేజర్ స్వాతితో ఫోన్‌లో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ బృందం ఇటీవల పెంబర్తికి వచ్చి పర్యాటక గ్రామంగా ప్రకటించిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వరంగల్–హైదరాబాద్ హైవే ఉండడంతో సుమారు 10 గ్రామాల ప్రజలు నిత్యం హైదరాబాద్, వరంగల్ నగరాలకు వెళ్తుంటారని వివరించారు. హస్తకళలకు పుట్టినిల్లయిన పెంబర్తిలో అన్ని బస్సులు నిలుపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నిర్మాల రత్నం, మాజీ ఉప సర్పంచ్ చినబోయిన రేఖ, స్థానికులు బండ రాములు, వెంకటేశం, చినబోయిన రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

బచ్చన్నపేట, డిసెంబర్ 4 : ధరణి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ఆపరేటర్ ఈర్ల వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర గౌరవాఅధ్యక్షులు డాక్టర్ కొనగాల మహేశ్, రాష్ట్ర అధ్యక్షులు చెనగాని పురుషోత్తంగౌడ్, జిల్లా కో ఆర్డినేటర్ రమావత్ రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో తనవంతు పాత్ర పోషిస్తానని వెంకటేశ్వర్ వివరించారు. ఎన్నికకు సహకారం అందించిన రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలి

బచ్చన్నపేట, డిసెంబర్ 04 : పంచాయతీరాజ్, మిషన్ భగీరథ శాఖకు సంబంధించి వాటర్‌ట్యాంకులను శుభ్రం చేయించాలని ఎంపీడీవో మల్లికార్జున్ గ్రామ కార్యదర్శులను కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని ఓహెచ్‌ఎస్ఆర్‌లను బ్లీచింగ్‌తో శుభ్రపర్చి, ట్యాంకుల కింద శుభ్రం చేయాలన్నారు. మిషన్‌భగీరథ నీటితో కలిగే లాభాలను ప్రజలకు వివరించాలన్నారు. చేతి పంపులు, నీటి వనరులు, సింగిల్, త్రీఫేస్ మోటర్ల వద్ద పిచ్చి మొక్కలను తొలగించాలని ఆయన కోరారు. జిల్లా పంచాయతీ అధికారి స్వరూపారాణి ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బెల్ట్‌షాపులను నిషేధించాలని సీపీఎం ఆందోళన

పాలకుర్తి, డిసెంబర్ 4: మండలంలోని ఆయా గ్రామాల్లోని బెల్ట్ షాపులను నిషేధించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు సింగారపు రమేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బెల్ట్‌షాపులను మూసివేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం బెల్ట్ షాపులను రద్దు చేస్తామని హామీ ఇచ్చి విఫలమైందన్నారు. ఎక్సైజ్ అధికారులు మాముళ్ల మత్తులో ఉన్నారని ఆరోపించారు. సీపీఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, చిట్యాల సోమన్న, సోమ సత్యం, మాసంపెల్లి నాగయ్య, ఏదునూరి మదార్, బెల్లి సంపత్, ముస్కు ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాశీ విశ్వనాథ ఆలయానికి విరాళం

నర్మెట, డిసెంబర్ 4: మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయానికి మండల కేంద్రానికి చెందిన మల్లాడి గున్నమ్మ గురువారెడ్డి పేరున వారి రెండో కుమారుడు మల్లాడి ఉపేందర్‌రెడ్డి రూ.50,116 అందించారు. ఈ మేరకు బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళం అందించారు. ఆలయ అభివృద్ధికి భక్తులు ముందుకు రావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గంగం నర్సింహారెడ్డి, కార్యదర్శి జంగిటి అంజయ్య, కోశాధికారి జోపర్తి ఉపేందర్, ఉపాధ్యక్షులు మల్లాడి శ్రీధర్‌రెడ్డి, రంగరాజు విజయ్, చల్ల మల్లయ్య, పార్నంది సతీశ్‌శర్మ, ప్రజ్ఞాపురం అంజనేయులు, రాజబోయిన లక్ష్మీనారాయణ, దేవులపల్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కేజీబీవీలో బోధన సిబ్బంది కోసం ఆహ్వానం

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 4 : మండలంలోని నమిలిగొండ కేజీబీవీలో నర్సింగ్‌లో విద్యాబోధన చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రజిత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన చేశారు. కేజీబీవీలో నర్సింగ్ విద్యార్థులకు గంటల పద్ధతిలో విద్యా బోధన చేయడానికి మహిళా అభ్యర్థులు గురువారం ఉదయం 9 గంటలకు తమ ఒర్జినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని ఆమె కోరారు.

'ధరణి'లో పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

జఫర్‌గఢ్, డిసెంబర్ 4 : ధరణి పోర్టల్‌లో పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. వెంకన్న మాట్లాడుతూ ధరణి సమస్యల పరిష్కారానికి రైతులు పెట్టుకున్న అర్జీలను పరిశీలించి వారం రోజుల్లో పూర్తి చేయాలని కోరారు. గత నెల 28న ముగిసిన ఓటరు నమోదు ఫారం 6, 7, 8లను ఆన్‌లైన్ లో నమోదు చేసి పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. ఐకేపీ ఏపీఎం రవీందర్ తో మాట్లాడుతూ మండలంలోని తిమ్మంపేట, తీగారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకరయ్య, డీటీ ఖాసీంనాయక్, ఆర్ఐ అనిల్ బాబు, ఏఆర్ఐ విష్ణువర్ధన్, ఐకేసీ ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిల్పూరు, డిసెంబర్ 4 : మండలంలోని శ్రీపతిపల్లికి చెందిన స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు రంగు హరీశ్ తాత రంగు మల్లయ్య (79) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఆఫీస్ ఇన్‌చార్జ్, మాజీ కూడా మాజీ డైరెక్టర్ ఆకుల కుమార్, నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, చిల్పూరు మండల పార్టీ ఇన్‌చార్జి మలోత్ రమేశ్‌నాయక్, కొయ్యడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు రంగు మల్లయ్య మృతదేహానికి నివాళులర్పించారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య భర్త నజీరుద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేశ్, మాజీ ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత బాలరాజు, పోలెపల్లి రంజిత్‌రెడ్డి పరామర్శించారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

పాలకుర్తి, డిసెంబర్ 4: ఏడాది కాంగ్రెస్ పాలనలో పాలకుర్తి నియోజక వర్గ అభివృద్ధి శూన్యమని, ధైర్యం ఉంటే దీనిపై స్థానిక ఎమ్మెల్యే చర్చకు సిద్ధమా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లేగ రాంమోహన్‌రెడ్డి సవాల్ విసిరాడు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా లేగ రాంమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డివి గొప్పలు తప్ప అభివృద్ధి లేదన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన పాత పనులకే కొత్త మంజూరు ఇస్తున్నదన్నారు. ఇదేనా ప్రజా పాలన ఆయన ప్రశ్నించారు. కమిషన్ల కోసమే ఎమ్మెల్యే పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ల జపం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత కాంట్రాక్టర్‌ను తొలగించి పాత కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, నియోజక వర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్, మండల పార్టీ అధ్యక్షులు దుంపల సంపత్, పల్లె కుమార్, పులిగిల్ల ఉపేందర్, నూనె అనిల్, బొమ్మనబోయిన సుధాకర్, రచ్చ కుమార్, కమ్మగాని శ్రీకాంత్, వెల్పుల దేవరాజు, కడుదుల నిరంజన్, వడ్లకొండరవి, భాగాల నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.